ప్లాస్టిక్ నిషేధమా.. అదెక్కడ?



● స్పందించని అధికారులు.. ● యథేచ్ఛగా వినియోగం ● ఎక్కడ చూసినా నిషేధిత ప్లాస్టిక్ లభ్యం

ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యం

తేలికగా, తీసుకెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందన్న మోజులో ప్లాస్టిక్ వినియోగంతో జరగబోయే అనర్థాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) వాడకం మళ్లీ మామూలైపోయింది. అధికారులకు గుర్తొచ్చినప్పుడు అదపాదడపా తనిఖీలు.. నాలుగైదు రోజులు దాచిపెట్టి మళ్లీ విక్రయాలు.. ఇదీ నగరంలో జరుగుతున్న ప్లాస్టిక్ నిషేధ చర్యలు. అంతే తప్ప పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలవుతోందా అంటే ప్రశ్నార్థకమే..?



మండుటెండల్లో ప్లాస్టిక్ కవర్లతో మామిడి తాండ్ర

దాబాగార్డెన్స్: నగరంలో నిషేధిత పాలిథిన్ కవర్ల నిషేధం అటకెక్కింది. వ్యాపారులు విక్రయిస్తున్న కవర్లన్నీ 120 మైక్రాన్లు దాటి ఉంటున్నాయా అంటే.. కళ్లు మూసుకుని మరీ.. లేదని చెప్పేయొచ్చు. తమకు గుర్తొచ్చినప్పుడు మాత్రమే అధికారులు చిరువ్యాపారులపై ప్రతాపం చూపి, జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు. దీనికి మూలాలైన తయారీదారులపై చర్యలకు మాత్రం సాహసించట్లేదు. అధికారులు హెచ్చరించినప్పుడు, దాడులు చేస్తారన్న భయంతో వారం, పది రోజులు కవర్లలో సరకులు ఇవ్వడం మానేస్తున్నారు. తర్వాత షరా మామూలే.

కొండల్లా ప్లాస్టిక్ వ్యర్థాలు

నగరంలో కాలుష్యం తగ్గాలంటే ఎస్‌యూపీ కవర్ల వినియోగాన్ని కట్టడి చేయాలి. అది ఆచరణకు దూరంగానే ఉంది. దీంతో వాడి పడేసిన పాలిథిన్ కవర్లు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. మట్టిలో, నీళ్లలో, కొండల్లో, గుట్టల్లో, చివరకు కాలువలు, గెడ్డల్లో పాలిథిన్ వ్యర్థాలు కొండల్లా పెరిగిపోతున్నాయి. చెత్త కుండీల్లో, ఆట మైదానాల్లో, బీచ్, ఖాళీ స్థలాల్లో.. ఇలా ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే కనిపిస్తున్నాయి. కనీసం ఇవి రీ సైక్లింగ్‌కు కూడా ఉపయోగపడవు. అతి పలుచగా ఉన్న పాలిథిన్ కవర్లను గుర్తించని పశువులు, వాటిని తిని మృత్యువాత పడుతున్నాయి.



ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన కాలువ

చిరు వ్యాపారులే కీలకం

సార్.. నాలుగు ఇడ్లీలు కట్టండి. సార్ ఫుల్‌మీల్స్ పార్సిల్ చేయండి. బాబూ డజన్ అరటిపండ్లు ఇవ్వు. రూ.20కి పువ్వులు కట్టు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇలాంటి చిన్నచిన్న కొనుగోళ్లలో అమ్మేవాళ్లు, కొనేవాళ్లకు ప్లాస్టిక్ కవర్లే ఆధారం. చిల్లర వర్తకులు ఎక్కువగా నిషేధిత మందం కలిగిన ప్లాస్టిక్‌నే వినియోగిస్తున్నారు. ఇవన్నీ చాలా వరకు బాహాటంగా జరిగే వ్యాపారాలే. ఇంతగా ప్లాస్టిక్ విక్రయాలు జరుగుతున్నా నియంత్రించాల్సిన అధికారుల కళ్లకు మాత్రం కనిపించకపోవడం శోచనీయం.

ప్రజల్లో అవగాహనతోనే సాధ్యం

పర్యావరణ ఉపయుక్తమైన సంచులు తప్ప 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన పాలిథిన్ సంచులు వాడకూడదన్న అవగాహన ప్రజల్లో పెరగాలి. అప్పటి వరకు ఈ సమస్యను అధిగమించడం కాస్త కష్టమేనని అధికారులు చెప్తున్నారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందంటున్నారు. దీంతో అంతా కలిసి రాకపోతే పాలిథిన్ రక్కసికి భవిష్యత్ తరాలు బలవడం ఖాయం.

ప్లాస్టిక్‌తో అనర్థాలెన్నో..

పాలిథిన్ కవర్లు మట్టిలో కలవడానికి వెయ్యేళ్లు పడుతుంది. మట్టికి మనిషికి మధ్య అడ్డుగోడలా పాలిథిన్ నిలుస్తోంది. నగరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తరలించే ఓపిక లేక పారిశుధ్య సిబ్బంది కాల్చిపారేస్తున్నారు. ఆ మంటలోంచి విష వాయువులు వ్యాపిస్తున్నాయి. ఫలితంగా క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు వస్తున్నాయి.

పట్టుబడితే జరిమానా

120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్ కవర్లపై నిషేధం ఉంది. వీటిని వినియోగిస్తూ పట్టుబడితే జరిమానా విధిస్తాం. నిషేధిత పాలిథిన్ కవర్లపై ప్రజల్లో అవగాహన కోసం ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తున్నాం. నిషేధానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకునే దిశగా పనిచేస్తున్నాం.

– మల్లయ్యనాయుడు, జోన్–4 జోనల్ కమిషనర్

క్లుప్తంగా

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



వినతి స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్–4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమారం జోన్–4 కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు యూసీడీ–1, రెవెన్యూ–12, టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 2 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యపై ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పించుకోరాదన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మహారాణిపేట: అనధికార నిర్మాణం చేపడుతున్న బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాధవధారవాసి మూల శ్యామలరావు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మాధవధారలోని తమ ఇంటిని ఆనుకుని ఉన్న 120 గజాల స్థలంలో బిల్డర్ గ్రూప్‌హౌస్ నిర్మిస్తున్నారని తెలిపారు. తమ స్థలాన్ని ఆక్రమించి సెట్ బ్యాక్స్ ఏమీ వదలకుండా నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీవీఎంసీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, బిల్డింగ్ ప్లాన్‌కు అనుమతి లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇదివరకే జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బిల్డర్ యథావిధిగా నిర్మాణం చేపడుతున్నాడని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆరోపించారు. స్థలం ముందు బోర్డు కూడా ఏర్పాటు చేయలేదని, రెండు వారాలుగా జీవీఎంసీ దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

దాబాగార్డెన్స్: బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు దాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఏఐబీడీపీఏ, బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యం కుల ధ్రువీకరణ పేరిట మహారాష్ట్ర సర్కిల్‌లోని ఎస్టీ అధికారులు, పెన్షనర్లను వేధిస్తోందని ఆరోపించారు. డీవోటీ ఆదేశాలను ఉల్లంఘిస్తూ పదవీ విరమణ చేసిన ఎస్టీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ నిరాకరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, కోశాధికారి ఆర్.సత్యనారాయణ, బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఈసీ హెచ్‌వీ సాగర్, అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, ఏఏ అష్రఫ్, జీఎస్‌ఎన్ రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో 12 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్పీఎఫ్ ఎస్ఐ సూరజ్‌కుమార్(మర్రిపాలెం), జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. కోరాపుట్ జిల్లా పాడువకు చెందిన ఈశ్వర్ కాముడి మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు గంజాయిని అక్రమంగా తీసుకురావడాన్ని గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని, రూ.60 వేల విలువైన 12 కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

‘వెన్నుపోటు కూటమి ప్రభుత్వం గద్దె దిగాలి’



బౌడారా రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగదాంబ: అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అలపన కనకరెడ్డి అన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి పిలుపుమేరకు కూటమి ప్రభుత్వ వెన్నుపోటు వైఖరిని నిరసిస్తూ వార్డు నాయకులు ధర్నా నిర్వహించారు. వార్డులో దుర్గాలమ్మ జంక్షన్ నుంచి బౌడారారోడ్డు, వెలంపేట, పండావీధి, ప్రసాద్‌గార్డెన్స్ వరకు ర్యాలీగా వెళ్లి, గాజులవీధి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి పాలనచేసే నైతిక హక్కులేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పార్టీ సిటీ సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సౌత్ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు సుధ, కర్రిరాము, మల్లబుజ్జి, గంగాధర్, నాగిరెడ్డి, నాయిని శ్రీనివాసరెడ్డి, రవి, పుష్ప, పి.రమణమ్మ, వై.రమణమ్మ, ఎ.రమణమ్మ, రాంబాబు, ప్రేమ్‌కుమార్, వినోద్, నగేష్, దుర్గాప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సంతోష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు, అత్యాచారాలు దారుణం



సమావేశంలో దళితులపై జరుగుతున్న దాడులపై చర్చిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, గ్రామ బహిష్కరణలు ఎక్కువయ్యాయని, వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని భీమ్‌సేన వార్ డిమాండ్ చేసింది. కంచరపాలెంలోని తమ కార్యాలయంలో అధ్యక్షుడు కొరమాటి చిన్నారావు అధ్యక్షతన సమావేశమయ్యారు. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తెనాలిలో ముగ్గురు దళిత యువకులను నడి రోడ్డు మీద బహిరంగంగా కొట్టిన ఘటన చూస్తుంటే ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో తెలుస్తోందని భీమ్‌సేన వార్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ అన్నారు. దళిత హోమ్ మినిస్టర్ అయినా కూడా ఈ సంఘటన జరగడం, అరికట్టలేని ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతోందన్నారు. కారంచేడు తరహా ఘటనలు పునరావృతం కావడం పాలక పార్టీల విధానాలే కారణమన్నారు. సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ వి.వి.దుర్గారావు, కోశాధికారి బల్లంకి కనకరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ జి.రవికుమార్, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు వాసుపల్లి ఆర్థిక సాయం



దివాకర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జర్నలిస్టులకు గత సీఎం వైఎస్ జగన్ హయాంలో చివరి దశలో ఆగిపోయిన ఇళ్లను, కూటమి ప్రభుత్వం ఇవ్వకపోతే మళ్లీ అధికారంలోకి వచ్చిన వెటనే అందిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్‌సీపీ పీఆర్వో, సీనియర్ జర్నలిస్ట్ పైలా దివాకర్‌తో పాటు మరో జర్నలిస్ట్‌కు రూ.ఐదు వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 15 ఏళ్లుగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సేవలందిస్తున్న దివాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయనకు ధైర్యాన్నిచ్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అతి తక్కువ జీతాలతో సమాజ శ్రేయస్సు కోసం పని చేసే జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం సరికాదన్నారు. జర్నలిస్టులకు కనీసం అక్రిడిటేషన్ కార్డులు కూడా మంజూరు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆక్షేపించారు. తక్షణమే అక్రిడిటేషన్లు మంజూరు చేసి, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకుడు సర్వేశ్వరరెడ్డి, భీశెట్టి ప్రసాద్, ఆకుల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: ఏపీఈపీడీసీఎల్ మధురవాడ డివిజన్ పరిధిలో అధికారులు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డు వరకు సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. వీటి ఉపయోగాలు, కేంద్రం అందించే సహాయం గురించి ప్రచారం చేశారు. విద్యుత్ విభాగం అధికారులు మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ కోసం ప్రభుత్వం రాయితీ కల్పించిందన్నారు. మూడు కిలోవాట్లకు రూ.78 వేలు, బీసీలకు మరో రూ.20 వేలు అదనంగా రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ర్యాలీలో మధురవాడ డివిజన్ సూపరింటెండెంట్ శ్యాంబాబు, జోన్–3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ, భీమిలి, ఆనందపురం, గోపాలపట్నం, పెందుర్తి డీఈఈలు అన్ని సెక్షన్ల జేఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లను సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబర్ 060810011006681, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ–మెయిల్ ఐడీ endow&eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

9 నుంచి ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవాలు



ఉమా చంద్రమౌళీశ్వరస్వామి

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో కొలువుదీరిన ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, కల్యాణరాట, కంకణధారణ జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణ ధారణ, మండపారాధన, ధ్వజారోహణ ఉంటాయన్నారు. 11వ తేదీ బుధవారం స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అనంతరం కల్యాణోత్సవం వైభవంగా జరిపిస్తామని పేర్కొన్నారు.

చిత్రలేఖనం, యోగాసనాల పోటీల్లో ప్రతిభ

సీతంపేట: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం చిత్రలేఖనం, యోగాసనాల పోటీలు నిర్వహించారు. ఎ.హర్షిణి, తులసి, మహాలక్ష్మి, చరణ్, హర్షవర్ధన్, యుగంధర్ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి అభినందించారు.

వార్డుల్లో విస్తృతంగా యోగా శిక్షణ



20వ వార్డులో యోగా శిక్షణ పొందుతున్న సచివాలయం, ఇతర ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: యోగాంధ్ర–2025 కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డుల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీ, శివాజీపాలెం, చినవాల్తేర్ ప్రాంతాలతోపాటు అనేక చోట్ల శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నగర ప్రజలను ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు చేసే దిశగా జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వార్డుల వారీగా తూర్పులో అనేక చోట్ల కొన్ని రోజులుగా యోగాపై శిక్షణ ఇస్తున్నారు. ఆర్పీలు, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, స్వయం ఉపాధి సంఘాల మహిళలు పాల్గొంటున్నారు. పలువురు ట్రైనర్ల ద్వారా యోగాసనాలపై శిక్షణ అందించి అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రికార్డు నెలకొల్పే దిశగా ప్రోత్సహిస్తున్నారు.

మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్నచూపు

● సంక్షేమ పథకాల్లో కోత తగదు
● అమ్మవార్లను దర్శించుకున్న వాసుపల్లి



అమ్మవారిని దర్శించుకున్న వాసుపల్లి, పార్టీ నాయకులు



శిల్పి పోలరాజును సత్కరిస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర మత్స్యకారుల జాతరోత్సవంలో భాగంగా పోలమాంబ, భూలోకమాత, కొత్తమాంబలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. విగ్రహాలను దేదీప్యమానంగా తీర్చిదిద్దిన శిల్పి చింతపల్లి చిన పోలరాజును సత్కరించారు. వాసుపల్లికి మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ చింతపల్లి పోతురాజు(పులి), ఉపాధ్యక్షుడు కాసరపు వేంకటేశ్వరరావు స్వాగతం పలికి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ఈ నెల 14 వరకు అమ్మవార్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు.

మత్స్యకారులంటే చంద్రబాబుకు చిన్నచూపు

మత్స్యకారులంటే చంద్రబాబుకు ఎప్పుడూ చులకన భావనేనన్నారు. గతంలో కూడా తమ వర్గాన్ని ఎస్టీలో చేర్చాల్సిందిగా కోరితే, ఇదే విశాఖలో చంద్రబాబు అవమానించాడని గుర్తు చేశారు. అబద్ధాలు, మోసం, ఇతర పార్టీలతో జతకట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గతంలో జగనన్న అందించిన మత్స్యకార భరోసాలో కోత విధించడం దుర్మార్గమన్నారు. సగానికి పైగా అర్హులని తప్పించడమే బాబు వెన్నుపోటుకు నిదర్శనమన్నారు. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు దశమంతుల చిన్ని, దశమంతుల మాణిక్యాలరావు, వేణు, కె.సాగర్, గనగల రామరాజు, సారిక దయకుమార్, చేపల రాజు, చింతకాయల వాసు పాల్గొన్నారు.

భగభగ ‘మండే’

● సత్తువను పీల్చేస్తున్న భానుడు
● అల్లాడుతున్న జనం
● రహదారులన్నీ నిర్మానుష్యం



కొనుగోలుదారులు లేక బోసిపోయిన అల్లిపురం మార్కెట్



ఎండకు నిర్మానుష్యంగా మారిన అల్లిపురం మెయిన్‌రోడ్డు



జనసంచారం లేని చావులమదుం జంక్షన్

అల్లిపురం: భానుడి భగభగలతో జనం అల్లాడారు. ఒంట్లో నీటిని, సత్తువను పీల్చేస్తున్నట్లుగా సోమవారం ఎండ మండిపోవడంతో బయటకు రావాలంటేనే హడలిపోయారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉదయం 8 దాటితే అడుగు బయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మార్కెట్లు బోసిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు గొడుగులను ఆశ్రయిస్తున్నారు. వాహనచోదకులు హెల్మెట్లు ధరిస్తున్నారు. మహిళలు చున్నీలు ముఖానికి చుట్టుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. పండ్ల రసాలు, కొబ్బరిబొండాలు, మజ్జిగలు, షర్బత్‌లు, ఖర్బూజా వంటి పండ్లను అధికంగా తీసుకుంటున్నారు.

నీటిని ఎక్కువగా తీసుకోవాలి

ఎండలను తట్టుకునేందుకు నీరు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయాలలో బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. పనులు వాయిదా వేసుకోవడమే ఉత్తమమంటున్నారు. శరీరాన్ని చల్లబరిచే పండ్లు, కూరగాయలు తీసుకోవాలని తెలిపారు.